క్లుప్తంగా

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): శ్రావణ పౌర్ణమి, శనివారం, శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని వెంకటేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు చేశారు. స్వామి వారికి నిర్వహించిన విశేష అభిషేకాలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు తరలివచ్చారు. అనంతరం స్వామి వారికి తులసీదళాలతో అర్చన, పంచహారతుల సేవ నిర్వహించారు. ఆలయ దేవస్థాన కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

వైభవంగా గంగానమ్మ తల్లి జాతర



ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్‌లో వేంచేసి ఉన్న గంగానమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. గంగానమ్మ అమ్మవారి గుడి నిర్వాహకులు మాచర్ల ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మవారి జాతర నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అమ్మవారి జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. అమ్మవారి చల్లని దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సాయంత్రం రామలింగేశ్వరనగర్‌లోని గాయత్రినగర్ నుంచి పడవలరేవు వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కాటూరి నాగరాజు, బాబి, బాలాజీ, చిన్న, కాము, సత్యన్నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో శనివారం 500 మందికి శ్రీవారి అన్నప్రసాదం అందించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి పర్యవేక్షణలో దాతలు చేకూరి వెంకటేశ్వరరావు, సామ్రాజ్యం, తాతినేని అధర్వ, సందీప్, అవంతి సహకారంతో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణపౌర్ణమి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారికి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ అధికారి లలితా రమాదేవి మాట్లాడుతూ అన్నప్రసాద వితరణలో పాల్గొనేవారు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): గుణదలలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మహిళా నేతలు పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత దేవినేని అవినాష్‌కు ఆయన సోదరి దేవినేని క్రాంతి రాఖీ కట్టి స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు, ఇతర మహిళా నేతలు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా కార్యాలయంలో మహిళా నేతలు, కార్యకర్తలతో పండుగ వాతావరణం నెలకొంది.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళను పెళ్లి చేసుకోవాలంటూ వెంటపడి వేధిస్తున్న వ్యక్తిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గొల్లపూడి సాయిపురం కాలనీకి చెందిన ఓ మహిళ తల్లితో కలిసి ఇంటి వద్దనే ఉంటుంది. ఆమెకు న్యూరాజరాజేశ్వరిపేటకు చెందిన బడిద బోయిన వంశీ అనే వ్యక్తి బంధువుల ద్వారా గతంలో పరిచయం ఉంది. అయితే ఆమె అతనితో మాట్లాడకుండా దూరంగా పెట్టింది. అయితే ఇటీవల కొద్ది కాలంగా వంశీ పెళ్లి చేసుకుంటానంటూ వెంటపడుతున్నాడు. ఎన్నిమార్లు చెప్పినా వినిపించుకోకపోవటం, వేధింపులు ఎక్కువవటంతో ఆమె భవానీపురం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొంతెండుతున్నా.. గుక్కెడు నీరు కరువాయే!

- పట్టించుకోని వీఎంసీ, పంచాయతీ అధికారులు
- జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో తాగునీటికి కటకట
- రిజర్వాయర్ నిర్మాణం శిలాఫలకానికే పరిమితం
- నాలుగు ట్యాంకర్లతో వాడుక అవసరాలకు నీటి సరఫరా



జక్కంపూడి వైఎస్సార్ కాలనీ



కాలువకు ఒక పక్కన ఉన్న మంచినీటి రిజర్వాయర్



వీఎంసీ వాటర్ ట్యాంకర్ల ద్వారా సంపుల్లో నింపుతున్న నీళ్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తాగు నీటికి కటకటలాడుతున్న జక్కంపూడి వైఎస్సార్ కాలనీవాసుల దాహార్తి ఈ ఏడాదైనా తీరేనా..? ఏ ఏడాదికి ఆ ఏడాది ఎదురు చూపులు తప్ప తాగునీటి సమస్య నేటికీ అపరిష్కృతంగానే ఉంది. కాలనీ ఏర్పాటయ్యి దశాబ్ద కాలం గడిచినా నేటికీ మంచినీళ్ల కోసం గొంతెండిపోతున్నా అటు నగరపాలక సంస్థ ఇటు గొల్లపూడి పంచాయతీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. కాలనీవాసులు మినరల్ వాటర్ క్యాన్లు కొని దాహార్తి తీర్చుకోవాల్సిన దుస్థితి. వాడుక అవసరాలకు సైతం చాలీచాలని నీటితో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రెండో రిజర్వాయర్ నిర్మాణానికి మైలవరం నియోజకవర్గం అప్పటి ఎమ్మెల్యే దేవినేని ఉమా మహేశ్వరరావు వేసిన శిలాఫలకం అక్కడికే పరిమితమయింది.

కాలనీలో మొత్తం 280 బ్లాకులు ఉండగా ఒక్కో బ్లాక్‌లో 32 ఫ్లాట్లు ఉన్నాయి. ఫ్లాట్‌కు కనీసం నలుగురు చొప్పున లెక్కేసుకున్నా మొత్తం మీద సుమారుగా 35 వేల మందికిపైగానే నివసిస్తున్నారు. కాలనీ మొత్తం మీద 1500 కేఎల్ సామర్థ్యంతో ఒక రిజర్వాయర్ మాత్రమే ఉంది. ఇది కాలనీకి ఒక వైపు ఉండగా అటు పక్కన ఉండే బ్లాకుల్లోని ప్రజలకు మాత్రమే వాడకం నీరు అందుతుంది. ఇక కాలనీకి మరో వైపు బ్లాకుల్లో నివసించే ప్రజలు నీటి ట్యాంకర్ల కోసం ఎదురు చూపులు చూడాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని బ్లాకుల్లో సుమారు 20 వరకు బోర్లు ఉండగా వాటి ద్వారా వచ్చే నీటిని వాడకానికి మాత్రం వాడుకుంటున్నారు.

నాలుగు ట్యాంకర్ల ద్వారా వాడకం నీరు సరఫరా....

నగర పాలక సంస్థ రోజూ నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తోంది. రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు వాటర్ ట్యాంకర్లు తిరుగుతూనే ఉంటాయి. ప్రతి బ్లాకులో ఉన్న వాటర్ సంప్‌లోకి ఆ నీటిని డంప్ చేస్తారు. ఒక్కో సంప్ నిండాలంటే కనీసం రెండున్నర ట్యాంకర్ల అవసరం అవుతాయి. సంప్ నిండిన తరువాత మోటారు వేస్తే ఆ బ్లాక్ టెర్రస్‌పై ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకుల్లోకి వెళతాయి. ఆ నీటిని బ్లాకులో ఉండే 32 ఫ్లాట్లలో నివసించేవారు వాడుకోవాల్సి ఉంటుంది. మోటారు వేసినప్పుడు వచ్చే కరెంట్ బిల్లు ఆయా ఫ్లాట్లలో ఉండేవారు చెల్లించాల్సి ఉంటుంది. వాస్తవానికి ట్యాంకర్ల ద్వారా వచ్చేవి మంచినీరే అయినా సంప్‌లోకి వచ్చే సరికి తాగేందుకు పనికిరావు. అదే విధంగా ప్రస్తుతం ఉన్న రిజర్వాయర్ నుంచికూడా సంప్‌ల్లోకి నీళ్లను పంపింగ్ చేస్తున్నారు. తాగేందుకు మాత్రం మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి క్యాన్లు కొనుగోలు చేయాల్సిందే.

రెండో రిజర్వాయర్ నిర్మాణం శిలాఫలకానికే పరిమితం....



కాలనీలో మరో రిజర్వాయర్ నిర్మాణానికి వేసిన శిలాఫలకం

కాలనీవాసుల నీటి కొరత తీర్చేందుకు ప్రధాన మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళిక (సీఐఐపీ) నిధులు రూ.523 లక్షల వ్యయంతో 1500 కేఎల్ సామర్థ్యంతో రెండో రిజర్వాయర్ నిర్మిస్తానని దేవినేని ఉమామహేశ్వరరావు జలవనరుల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 2019 ఎన్నికలకు ముందు శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్నారు. ఎన్నికలకు ముందు తమను మభ్యపెట్టి ఓట్లు వేయించుకునేందుకే హడావుడిగా శంకుస్థాపన చేశారని, ఆ తరువాత దాని గురించి పట్టించుకోలేదని స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు. అప్పట్లో ఆయన సొంత నియోజకవర్గంలోనే తాగు నీటి కొరత ఉండటం ఆయన అసమర్థతే కారణమని కాలనీవాసులు గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఆయన స్థానంలో గొల్లపూడి గ్రామానికి చెందిన మరో టీడీపీ నాయకుడు కాలనీలో చక్రం తిప్పుతున్నా తాగునీటి గురించి మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

రమణీయం శ్రీవారి కల్యాణ వైభోగం



ప్రత్యేక అలంకరణలో స్వామి



సహస్రదీపాలంకరణ సేవలో శ్రీవారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కలియుగదైవం వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం శనివారం సాయంత్రం కమనీయంగా జరిగింది. వన్‌టౌన్‌లోని వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో పవిత్రోత్సవాలను పురస్కరించుకొని శ్రీవారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం, శ్రవణానక్షత్రం స్వామి వారి జన్మనక్షత్రంతో పాటుగా ఆయన వివాహ తిథి కూడా అదే కావడంతో ఏటా పవిత్రోత్సవాల వేళ స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. అందులోనూ స్వామి వారికి ప్రీతికరమైన శనివారం రావటం మరింత ప్రత్యేకత సంతరించుకుంది. కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఆదేవదేవునికి పూజలు నిర్వహించారు. నమో వెంకటేశాయ అనే నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మంగళవాయిద్యాలు, హరినామస్మరణ, వేదపఠనం, అన్నమయ్యకీర్తనాలాపనలు, వీనులవిందైన వ్యాఖ్యానం, మంత్రోచ్చరణల మధ్య స్వామి వారి కల్యాణోత్సవం భక్తులకు కనువిందు చేసింది. తొలుత స్వామివారి ఉత్సవమూర్తులను గరుడవాహనంపై మేళతాళాలతో కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు. అలాగే పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి వారికి గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. అక్కడి నుంచి అత్యంత రమణీయంగా అలంకరించిన వేదికపై స్వామివారిని అధిష్ఠింపజేశారు. అనంతరం మహాసంకల్పం చేయించారు. స్వామివారికి మధుపర్కాలను సమర్పించి వివాహానికి సిద్ధం చేశారు. అనంతరం పుణ్యహవాచనం, కన్యాదానం, మంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆగమ పండితులు ఒక్కొక్క ఘటాన్ని వివరిస్తూ ఉత్సవాన్ని జరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీవారికి నిర్వహించే నిత్యకల్యాణం, మాసకల్యాణం వంటి ఉత్సవాలు కేవలం తంతు కాదన్నారు. సకలసృష్టికి శుభాలు చేకూరాలని స్వామివారికి నిర్వహించే మంగళప్రదమైన పూజలన్నారు. శ్రావణమాసంలో నిర్వహించే ఈ కార్యక్రమాలు మరింత ఫలితాన్ని ప్రసాదిస్తాయన్నారు. స్వామివారి పాదుకలపై తలంబ్రాలు పోసి ఆశీస్సులు అందుకున్నారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం...

స్వామివారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని ఉదయం తిరుమంజనం నిర్వహించారు. ఫలపుష్ప సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా తిరుమంజన అభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవిరాట్‌ను అత్యంత సుందరంగా అలంకరించారు. కల్యాణోత్సవం అనంతరం ప్రసాదవితరణ జరిగింది. అలాగే ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయం పలు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆగమ పండితులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్, అదేపల్లి మురళీకృష్ణమాచార్యులు తదితరులు వైదిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురు ప్రముఖులు ఈ ఉత్సవంలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

గరుత్మంతుడి విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన



విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యే బొండా

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోనే ప్రప్రథమంగా ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయంలో నిర్మించతలపెట్టిన 36 అడుగుల గరుత్మంతుడు విగ్రహ నిర్మాణానికి శనివారం మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆలయకమిటీ సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్న ఆలయకమిటీ సభ్యులను అభినందించారు. నగరానికే తలమానికంగా గరుత్మంతుడు విగ్రహం ఏర్పాటు చేయాలని వారు సూచించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి డీవీఎస్ రాజు, దాట్ల శివరామరాజు మాట్లాడుతూ కాల సర్ప నాగదోష, దుష్ట శక్తులు, సర్పదోష నివారణ, రుణబాధలు అనారోగ్య సమస్యలు తొలగి ప్రజలు సుఖసంతోషాలతో ఉండేందుకు తాము 36 అడుగుల గరుత్మంతుడు విగ్రహ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు జీవీ సుబ్బరాజు, బడేటి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులందరికీ సబ్సిడీ అందించాలి

వించిపేట(విజయవాడపశ్చిమ): గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హజ్‌యాత్రకు వెళ్లే ముస్లిం మైనార్టీలకు సబ్సిడీతో పాటు అదనంగా అయ్యే ఖర్చును కూడా చెల్లించి ఘనంగా వారికి వీడ్కోలు పలికేవారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీ బాబా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హజ్ యాత్రికులకు లక్షరూపాయలు సబ్సిడీ ఇస్తామని ప్రకటించి మోసం చేసిందని విమర్శించారు. ఈ ఏడాది గన్నవరం నుంచి వెళ్లిన 72 మంది హజ్ యాత్రికులకు మాత్రమే సబ్సిడీ ఇచ్చి ఇతర ప్రాంతాల నుంచి వెళ్లిన యాత్రికులకు ఇవ్వకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి పవిత్ర హజ్‌యాత్రకు బెంగళూరు, హైదరాబాద్ నుంచి వెళ్లిన వారికి సబ్సిడీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. కేవలం గన్నవరం నుంచి వెళ్లిన హజ్ యాత్రికులు మాత్రమే ఆంధ్రులా.. రాష్ట్రానికి చెందిన వారు ఇతర ప్రాంతాల నుంచి హజ్ యాత్రకు వెళ్లిన వారు కాదా అని ప్రశ్నించారు. హజ్ యాత్ర చేసి వచ్చిన ప్రతి ఒక్క యాత్రికునికీ సబ్సిడీ అందించాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లపూడిలో దాసరి సూర్యప్రకాష్ (32) తన తల్లి పుష్పలత, సోదరుడు చిన్నరాజుతో కలిసి నివసిస్తున్నారు. గొల్లపూడిలో వెల్డింగ్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అయితే పుష్పలత, చిన్నరాజులు ఇద్దరూ మానసిక సమస్యలతో జీవిస్తున్నారు. అయితే సూర్యప్రకాష్ కుటుంబ సభ్యుల సమస్యలతో పాటుగా తనకు వివాహం కావటం లేదనే బాధతో అప్పుడప్పుడు తన పెదనాన్న కుమారుడు విజయకుమార్‌తో బాధలు చెప్పుకుంటూ ఉండేవాడు. ఈ నెల మూడో తేదీన గడ్డి మందును మద్యంలో కలుపుకొని తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆ మరుసటి రోజు ఆ విషయం తెలుసుకున్న సూర్యప్రకాష్ బాబాయి దాసరి విజయ కుమార్ అయన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సూర్యప్రకాష్ శనివారం తెల్లవారుజామున మరణించాడు. దానిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16న బాలగోకుల వేషధారణ పోటీలు

విజయవాడ కల్చరల్: సంస్కార భారతి మహానగర్ శాఖ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈనెల 16న బాల గోకులం, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలోపు చదివే బాల బాలికలకు బాలకృష్ణుని వేషధారణ పోటీలు, 6 నుంచి 10 తరగతిలోపు బాల బాలికలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల గోకులంలో పాల్గొనేవారు బలరాముడు, శ్రీ కృష్ణుడు, యశోద గోపికల వేషధారణలో పాల్గొనాలని, చిత్రలేఖనంలో పాల్గొనేవారు బాల కృష్ణుని లీలలు అంశంగా చిత్రాలు గీయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హనుమంతరాయ గ్రంథాలయంలో 16 వ తేదీ ఉదయం నుంచి జరుగుతాయని పేర్కొన్నారు.

ఘనంగా రాఖీ వేడుకలు



రాఖీ కడుతున్న విద్యార్థిని

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో వరలక్ష్మీ పూజ, రాఖీ పర్వదిన వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు, హాస్టల్ స్టూడెంట్స్ మహాలక్ష్మీ అవతారమైన శ్రీ వరలక్ష్మీదేవి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రత్యేక వస్త్రధారణతో సందడి చేశారు. అలాగే కళాశాలలో రాఖీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రాఖీలు కట్టి హడావుడి చేశారు. పూజల్లో పాల్గొన్న కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను గురించి తెలియజెప్పటంతో పాటుగా ఆచరణలో చూపేందుకు ఈ విధమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే సంప్రదాయ నృత్యాలు, గీతాలు, ఏకాంకికలతో విద్యార్థులు సందడి చేశారు. కళాశాల ఉపాధ్యక్షులు పొట్టి సురేంద్రకుమార్, కోశాధికారి కాజా రాఘవయ్య, సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొంగలి షెడ్డులో పొయ్యిల కొరత!

- నదుపాయాలపై చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి
- గతంలో 18 పొయ్యిలు, ప్రస్తుతం 9కి కుదింపు
- కార్యరూపం దాల్చని మెట్ల మార్గం పొంగలిషెడ్డు



పొంగలి షెడ్డులో ఏర్పాటు చేసిన కొబ్బరి కాయల కౌంటర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కోరిన కోర్కెలు తీర్చే దుర్గమ్మకు మొక్కులు చెల్లించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తుంటారు. భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని చెబుతున్న దేవస్థాన అధికారులు, క్షేత్ర స్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. తమ ఇంట ఏ శుభకార్యం జరిగినా పొంగలి నైవేద్యం సమర్పించడం తెలుగు రాష్ట్రాల్లోని భక్తుల ఆనవాయితీ. రాష్ట్రంలోని అతి పెద్ద దేవాలయాల్లో రెండో స్థానంలో ఉన్న దుర్గగుడిలో మాత్రం భక్తులు పొంగలి వండేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. దుర్గగుడి దేవస్థాన ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద దేవస్థానం పొంగలి షెడ్డును ఏర్పాటు చేసింది. దాతల సహకారంతో షెడ్డులో 18కి పైగా గ్యాస్ పొయ్యిలను ఏర్పాటు చేసి రూ. 50 టికెట్‌పై పొంగలి వండుకునేందుకు భక్తులను అనుమతిస్తున్నారు. శ్రావణ మాసం, వివాహాలు అధికంగా ఉండే నెలలో పొంగలి షెడ్డు భక్తులతో కిటకిటలాడుతుంది. భక్తుల రద్దీ క్రమంగా పెరగడంతో మరో పొంగలి షెడ్డు ఏర్పాటు చేసేందుకు దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు సైతం సిద్ధం చేశారు. మహా మండపం పరిసరాల్లో రెండో పొంగలి షెడ్డు ఏర్పాటు చేయాలని భక్తుల నుంచి డిమాండ్ వినిపిస్తుంది.

కొత్తది లేదు.. పాత షెడ్డులో కోత...!

కనకదుర్గనగర్ వైపు నుంచి వచ్చే భక్తులు పాత మెట్ల మార్గం సమీపంలోని ఖాళీ స్థలంలో కట్టెల పొయ్యిపై పొంగలి తయారు చేస్తుంటారు. శుక్రవారం, పండుగలు, సెలవు రోజులలో ఈ ప్రాంతంలో రద్దీగా ఉంటుంది. దీంతో ఆ పరిసరాల్లో మరో పొంగలి షెడ్డు ఏర్పాటు చేయాలని గతంలో ఈవోలుగా పని చేసిన అధికారులు నిర్ణయించారు. అయితే ఇంత వరకు అది కార్యరూపం దాల్చలేదు. మరో వైపున ఘాట్‌రోడ్డులో ఉన్న పొంగలి షెడ్డులో వినియోగంలో ఉన్న 18 గ్యాస్ పొయ్యిలలో సగం పొయ్యిలను తొలగించాలని ఆలయ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. షెడ్డులో కొంత భాగంలో ఉన్న పొయ్యిలను తొలగించి గోడ నిర్మించి కొబ్బరి కాయల కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు కొబ్బరి కాయల కౌంటర్ కోసం షెడ్డులో పొయ్యిలను తొలగించడం ఎంత వరకు సబబని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

వంతు కోసం ఎదురు చూపులు...



పొంగలి వండే భక్తులతో పొయ్యిల వద్ద రద్దీ

పొంగలి షెడ్డులో గ్యాస్ పొయ్యిలను తొలగించడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. పండుగలు, పర్వదినాలలో పొంగలి నైవేద్యం వండేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తుండటంతో తమ వంతు వచ్చే వరకు భక్తులు వేచి ఉండాల్సి వస్తుంది. పొంగలి వండే దగ్గరే గంటల తరబడి వేచి ఉండటంతో భక్తుల కుటుంబ సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన దేవస్థానం ఇలా ఉన్న పొయ్యిలను తొలగించడంపై పునరాలోచన చేయాలని కోరుతున్నారు. పక్కనే నిరుపయోగంగా ఉన్న షెడ్డులో కొబ్బరి కాయల కౌంటర్ ఏర్పాటు చేస్తే బాగుండేదని భక్తులు అభిప్రాయపడుతున్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురి కావడమే కాకుండా పొంగలి వండేందుకు గ్యాస్ పొయ్యి ఖాళీ అయ్యే వరకు ఎదురు చూపులు చూడాల్సి వస్తుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్టీల సమగ్ర స్థితిగతులకు కమిషన్ ఏర్పాటు చేయాలి

ఎస్టీ ఉద్యోగుల సంఘం డిమాండ్



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): షెడ్యూల్డ్ జాతుల (ఎస్టీ) జాబితాలోని 35 కులాల సమగ్ర స్థితిగతుల అధ్యయనం కోసం కమిషన్ ఏర్పాటు చేయాలని ఎస్టీ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశంలో అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజనులుగా పిలిచే ఆదివాసీల విద్య, వైద్య, ఉపాధి ఇలా అన్ని రంగాల్లో స్థితిగతులను అధ్యయనం చేయాలన్నారు. కమిషన్ ఏర్పాటు చేసి సమగ్రంగా సమీక్షించాలన్నారు. ఉద్యోగ సంఘం నాయకులు కటారి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఎస్టీ భవన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎరుకల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రమేష్ నాయక్ మాట్లాడుతూ ఆదివాసీల్లోని ప్రతి కులం అన్ని రంగాల్లో సమాంతరంగా వృద్ధిలోకి రావడానికి కులాల సమూహ కార్పొరేషన్లు ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలన్నారు. సాల బోగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల్లోని బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేష్, వివిధ్న బహుజన సంఘాల నాయకులు గుబ్బల నాగేశ్వరరావు, నెరుసు నాగమణి యాదవ్, కందికట్ల నరసింహారావు, గుదే రాంబాబు, పెరియార్, పాము రవీంద్రనాథ్, గంటిమళ్ల సత్తిబాబు, దేవరకొండ సాంబశివరావు, శివబాల నాగరాజు, సురేష్, సుశీల, రమేష్ నాయక్, కళావతి బాయ్, ఎల్లయ్య, రాములు, శంకర్ శ్రీను, గోపినాథరావు నాయక్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ కార్మికులందరికీ ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న బుద్దె రాజు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇళ్లు లేని ఆప్కాస్ కార్మికులు అనేకమంది నగర పాలక సంస్థ పరిధిలో ఉన్నారని వారందరికీ ప్రభుత్వం వెంటనే నగర పరిధిలో ఇళ్లు మంజూరు చేయాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా కోరారు. 54వ డివిజన్ కార్నర్ మీటింగ్ శనివారం ఉదయం స్థానిక శానిటరీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో అనేకమంది పేద పారిశుద్ధ్య కార్మికులు జీతాలు మీదే ఆధారపడి బతుకుతున్నారని చెప్పారు. వీరందరూ అద్దె ఇళ్లలో నివసిస్తూ వచ్చిన జీతంలో చాలా మొత్తం అద్దెలకే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న స్థలాల్లో వీఎంసీ ద్వారానే ఇల్లు కట్టించి అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర నాయకులు పగిడి కత్తుల రాము, మురుగేషన్ రాము, యూనియన్ గౌరవాధ్యక్షులు జక్కి జేమ్స్, సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్, కోశాధికారి తుపాకుల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.